క్లుప్తంగా

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



పెడకల్లేపల్లి(మోపిదేవి): నూతన వధూవరులను అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పెడకల్లేపల్లిలో వైసీపీ సీనియర్ మాజీ డైరెక్టర్ పండలనేని అన్నపూర్ణ మరియు పండలనేని ప్రభాకరావు, కనకదుర్గ కుమారుడు సతీష్‌కుమార్‌– దాలి సమ్మక్క నూతన దంపతులను శుక్రవారం ఆశీర్వదించారు. వీరివెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కడకొళ్లు నరసింహారావు, అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, లింగం జనార్దన్‌రావు, తుఠారం కృష్ణ, పండలనేని శివప్రసాద్, తండు వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

బాలాత్రిపుర సుందరికి లక్ష మల్లెల పూజ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బొజ్జిపేటలో నాగేశ్వరస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం బాలా త్రిపురసుందరి అమ్మవారికి లక్ష మల్లెలతో పూజలు చేశారు. అనిశెట్టి శ్యాంప్రసాద్, శేషు వెంకట భారతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నిత్య ఔ పాసన, బలిహరణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో వై.శిరీష పర్యవేక్షించారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ బ్యాచ్‌– 2025 రిక్రూట్‌మెంట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని ఆశాఖ అధికారి జి.రమేష్ శుక్రవారం తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్‌, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు టెట్ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 200 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటి వరకు 88 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 90141 30833 నంబరును సంప్రదించాలన్నారు.

అధ్యాపకురాలికి ఎక్స్‌లెన్స్ ఎడ్యుకేషన్ అవార్డు



అవనిగడ్డ: కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ టి.దీనా ఎలిజిబెత్‌కు ఎనిలెప్ గ్రూప్ ఆధ్వర్యంలో అందిస్తున్న అంతర్జాతీయ ఎక్స్‌లెన్స్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. ఈ మేరకు శ్రీలంక దేశంలోని కొలంబోలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుల ద్వారా ఈ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న దీనా ఎలిజిబెత్‌ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అభినందించారు. డిగ్రీ కళాశాల ఖ్యాతిని ఎలిజిబెత్ ఖండాంతరం చేశారని కొనియాడారు.

నేటి నుంచి శ్రీకాకుళేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 10 నుంచి 14 వరకు శ్రీకాకుళేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. రోజువారీ కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ దేవరాయల మహోత్సవ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించి నాట్య కళావిశారద కేవీ సత్యనారాయణ సమర్పణలో గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించనున్నట్లు డీసీ తెలియజేశారు.

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధిపై సమీక్ష

పెడన: పట్టణ పరిధిలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధిపై కమిటీ సభ్యులతో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమీక్షించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశంలో ఆయనకు కమిటీ సభ్యులు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. సుమారు రూ.5 కోట్ల అంచనాతో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో శ్మశానం అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు.

కమర్షియల్ కనుమరుగు

- డొమెస్టిక్ సిలిండర్లను వాడేస్తున్న వ్యాపారులు
- మామూళ్ల మత్తులో క్షేత్రస్థాయి సిబ్బంది
- కమర్షియల్ సిలిండరు రూ.1,950..డొమెస్టిక్ రూ.900
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పౌరసరఫరాల శాఖాధికారులు



కమర్షియల్ సిలిండరు



టిఫిన్ సెంటరు వద్ద రెండు డొమెస్టిక్ సిలిండర్లు

పెడన: గృహ వినియోగ సిలిండర్లకు గిరాకీ పెరిగింది. కమర్షియల్ (వ్యాపార రంగంలో వినియోగించే) సిలిండర్ల స్థానంలో గృహావసరాలకు (డొమెస్టిక్) వినియోగించే సిలిండర్లు అధికంగా వాడటమే ఇందుకు కారణం. ఫలితంగా గృహావసరాలకు వినియోగించే సిలిండర్లు సకాలంలో అందటం లేదు. కమర్షియల్ సిలిండర్లు వాడకపోవటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

వివరాలివీ..

హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్ ఇలా ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించేస్తున్నారు. ఫంక్షన్లు, ఇతర అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించేస్తూ జేబులు నింపేసుకుంటున్నారు. వ్యాపారాలకు డొమెస్టిక్ సిలిండర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖాధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

డీలర్లకు లక్ష్యాలు..

మరో పక్క గ్యాస్ డీలర్లకు లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు కమర్షియల్ సిలిండర్లు నెలకు కొన్ని వినియోగించాల్సిందేనని స్పష్టం చేయడంతో వీటిని బలవంతంగా కొంత మంది వ్యాపారులకు ఇస్తున్నారు. ఒక కమర్షియల్ సిలిండరు గ్యాస్ ధర రూ.1,950గా ఉంది. కమర్షియల్ సిలిండరు కనెక్షన్ తీసుకోవాలంటే వ్యాపారానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులతో కలిపి సుమారు రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు అవుతుంది. అదే డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలంటే పలు ధ్రువీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలతో కలిపి రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు ఖర్చు అవుతుంది. ఖాళీ డొమెస్టిక్ గ్యాస్‌తో తీసుకోవాలంటే రూ.900 చెల్లించాలి. దీంతో వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తూ కమర్షియల్ సిలిండర్ల జోలికి పోవడం లేదు.

ఫిల్లింగ్ చేస్తున్నారా అనుమానాలు

డొమెస్టిక్ సిలిండర్లలో ఉండే గ్యాసును తీసి కమర్షియల్ సిలిండర్లను నింపుతున్నారనే అనుమానాలు కూడా ఉన్నాయి. గతంలో దాడులు చేసి ఈ విధంగా చేస్తున్న వారిని పట్టుకున్న సందర్భాలు పెడనలో ఉన్నాయి. కమర్షియల్ సిలిండరు వాడితే 20 రోజులు లేదా 25 రోజులు వస్తుంది. కమర్షియల్ గ్యాస్ వినియోగదారుల గణాంకాలు ఎవరి వద్దా ఉండటం లేదు.

చర్యలు తీసుకుంటాం..



మా దృష్టికి రాలేదు. వాస్తవంగా పౌరసరఫరాల శాఖకు సంబంధించిన వీడీఎస్ టీటీ చూస్తారు. అయినా మా దృష్టికి వచ్చింది కాబట్టి తప్పకుండా పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. డీలర్ల నుంచి కూడా కమర్షియల్, డొమెస్టిక్ ఎంత మంది వినియోగిస్తున్నారో సమాచారం సేకరించి పటిష్ట చర్యలు చేపడతాం.
– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

కార్యకర్తలను పరామర్శించిన పేర్ని కిట్టు



పార్టీ కార్యకర్త జ్యోతిని పరామర్శిస్తున్న పేర్నికిట్టు, కార్పొరేటర్ ప్రసాద్

మచిలీపట్నంటౌన్: గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ స్టెంట్ వేయించుకున్న ఇరువురు పార్టీ కార్యకర్తలను మైపార్ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పరామర్శించారు. శారదానగర్‌కు చెందిన బాబూరావు అనే కార్యకర్త స్టెంట్ వేయించుకుని ఇంటి వద్ద ఉండటంతో ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గిలకలదిండికి చెందిన పార్టీ కార్యకర్త చింతా శ్రీరామమూర్తి కోడలు జ్యోతి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టెంట్ వేసుకోగా ఆమెను పరామర్శించారు. ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు వెంట కార్పొరేటర్లు యర్రపాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి ప్రసాద్, మావడవరపు రామ్‌ప్రసాద్, నాయకులు మట్టా నాంచారయ్య, గాజుల భగవాన్ ఉన్నారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు

సీడీపీవో సముద్రవేణి



మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

పెడన: అపరిచితులను నమ్మి మోసపోవద్దని, సెల్‌ఫోన్లు అతిగా వినియోగించడం వల్ల అనర్థాలు వస్తాయని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీవో ఎం.సముద్రవేణి అన్నారు. కిశోర వికాస కార్యక్రమాన్ని పురస్కరించుకుని యుక్త వయస్సు బాలికలకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీడీపీవో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, సెల్‌ఫోన్లు వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెడన సూపర్‌వైజర్ పి.కల్యాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, భారతి, షకీలాబేగం, కృష్ణకుమారి, కుర్షిద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ



చందాల గ్రామంలో కిశోర వికాసం శిక్షణలో బాలికలు, అధికారులు

కృత్తివెన్ను: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చినగొల్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాగౌరి మాట్లాడుతూ కిశోర బాలికలు ఈ వయస్సులో తమ శరీరంలో జరిగే మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోరాదని పొరపాటున తల్లిదండ్రులు అటువంటి ప్రయత్నం చేస్తే మీ గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియజేయాలని పిల్లలకు వివరించారు. చదువుపై మాత్రమే దృష్టి ఉండాలని, లేనిపోని ఆకర్షణలకు లోనుకాకూడదన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో పింఛన్ నిలిపివేతపై ఆవేదన



ఈవోపీఆర్డీ పర్వతుల్లాకు పింఛను అర్హత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న నాగరాజు

పెడన: రాజకీయ కక్షతో తన వృద్ధాప్య పింఛనును టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి నిలిపివేస్తున్నారని మద్దాల నాగరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లంకలకలవగుంట గ్రామానికి చెందిన నాగరాజు తన వృద్ధాప్య పింఛనును సర్పంచ్ భర్త, మరికొందరు కక్షతో అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనపై కక్ష సాధింపు చర్యలు ప్రారంభమయ్యాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికే మూడు సార్లు తన పింఛనును నిలిపివేసిన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో తిరిగి మంజూరు చేశారని నాగరాజు గుర్తు చేశారు. అయినా పింఛను మళ్లీ నిలిపివేయాలని ఫిర్యాదు చేశారని, దీంతో శుక్రవారం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ పర్వాతుల్లా విచారణకు వచ్చారన్నారు. మీడియా ముందే కన్నీటి పర్యంతమైన నాగరాజు అధికారుల తీరు మనస్థాపానికి గురిచేస్తోందని, రాజకీయ కారణాలతో నాకు న్యాయం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కమనీయం.. గోకర్ణేశ్వరుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. గురువారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో అమ్మవార్లను, నందీశ్వరుడిపై స్వామివారిని కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి రాజమండ్రికి చెందిన పండితులు మణికంఠశర్మ కల్యాణతంతును నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక జగన్నాథశర్మ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ సుధాకర్ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. కల్యాణోత్సవాల్లో శుక్రవారం కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, లింగారెడ్డిపాలెం, మందపాకల, కోడూరు, జరుగువానిపాలెం, పోటుమీద గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ సుధాకర్, జేఏ చిట్టిప్రోలు శివ ప్రసాద్, గ్రామప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు యార్లగడ్డకు కలెక్టర్ రాక

చల్లపల్లి: ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై మండల పరిధిలోని యార్లగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ తెలిపారు. సూర్యఘర్ ఏర్పాటుకు జిల్లాలో యార్లగడ్డ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఎంపికచేశారని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. సదస్సులో సూర్యఘర్ కోసం నూతన దరఖాస్తుల స్వీకరణ, వెండర్ ఎంపిక, బ్యాంక్ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ, సర్టిఫికెట్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవగాహన సదస్సుకు తరలి రావాలని కోరారు.

నేడు పీఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు

పెడన: పీఎం సూర్యగర్‌పై అవగాహన సదస్సును శనివారం ఉదయం మండల పరిధిలోని నందమూరు గ్రామంలో ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ సీహెచ్ మాణిక్యాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు నందమూరు పీఏసీఎస్ ఆవరణలో జరిగే ఈ సదస్సులో నూతన దరఖాస్తుల ప్రక్రియ, వెండర్స్ ఎంపిక బ్యాంకు రుణాల దరఖాస్తుల స్వీకరణ సర్టిఫికెట్ల సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. డివిజన్ అధికారులు బ్యాంకు అధికారులు హాజరవుతున్నారన్నారు. నందమూరు గ్రామాన్ని మోడల్ సూర్య ఘర్ గ్రామంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

తీరంలో పోలీసుల ప్రత్యేక నిఘా



కోడూరులో వాహన తనిఖీలు చేస్తున్న సీఐ యువకుమార్

కోడూరు: భారత్‌– పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో పోలీసులు తీర ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు తీరప్రాంత గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక గస్తీ నిర్వహించారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి పర్యవేక్షణలో 50 మంది పోలీసులు పాలకాయతిప్ప, హంసలదీవి, బసవానిపాలెం, లింగకొళ్ల గ్రామాల వెంట గస్తీ చేపట్టారు. సముద్రం వెంట అపరిచిత వ్యక్తులు తీరంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐలు సూచించారు. చొరబాటుదారులను గుర్తించే విధానంతో పాటు ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాలకాయతిప్ప బీచ్, సాగరసంగమం ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ జరిపారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో సీఐ యువకుమార్, ఎస్ఐ చాణక్య సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు.

సమ్మె నోటీసు అందజేసిన హమాలీలు



సివిల్ సప్లయిస్ అధికారికి సమ్మె నోటీస్ అందజేస్తున్న హమాలీ కార్మికులు

మచిలీపట్నంటౌన్: సివిల్ సప్లయిస్ హమాలీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సివిల్ సప్లయిస్ అధికారులకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో సివిల్ సప్లయిస్ హమాలీలు పాల్గొంటారని, విధులకు హాజరుకామని ఈ సందర్భంగా తెలియజేశారు. హమాలీలకు ఈఎస్ఐ తదితర వైద్య సేవలు పొందడానికి అవకాశం ఉన్న కోర్టు కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని, సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. ప్రైవేట్ గిడ్డంగులను ప్రోత్సహించకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గోదాముల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరువోలు జయరావు, హమాలీ ముఠా కార్మికులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి మహోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



బుద్ధ జయంతి వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, మల్లికార్జునరావు

ఘంటసాల: స్థానిక కళ్యాణ బుద్ధ ప్రాజెక్టును సందర్శించి, బుద్ధ జయంతి మహోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బౌద్ధుల కాలంలో మహా విద్యాసంస్థగా విలసిల్లిన మహాచైత్యంలో లభించిన ప్రాచీన బౌద్ధ విగ్రహాలు పారిస్, చెన్నై, ఘంటసాల మ్యూజియంలలో ఉన్నాయన్నారు. ప్రపంచంలో ప్రతి బౌద్ధ భిక్షువు తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రాంతమే ఘంటసాల బౌద్ధక్షేత్రంలో ఈ నెల 12న జరిగే బుద్ధ జయంతి మహోత్సవం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బుద్ధ జయంతి వేడుకలకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ హాజరవుతారని చెప్పారు. బుద్ధ జయంతి వేడుకల సందర్భంగా ఘంటసాల కళ్యాణ బుద్ధ ప్రాజెక్టు ప్రాంగణంలో బౌద్ధ సాహితీ– చారిత్రక సదస్సు, గౌతమ బుద్ధ నృత్య రూపకం, బుద్ధ చరిత్రపై ఆర్ట్ గ్యాలరీ, కళా బృందాలు, కళాకారుల భారీ ర్యాలీ ఉంటుందని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు కోరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, శ్రీకాకుళం టీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మట్టి తోలుకోమని మీరే చెప్పారంట

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేను నిలదీసిన జనసేన నేతలు

గూడూరు: మండలంలో అనుమతులు లేకుండా మట్టితవ్వకాలు జరుపుతున్నారంటూ జనసైనికులు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. పెడన ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరులో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన హరిరామ్, నాయకులు తలుపుల వెంకట కృష్ణారావు, కనపర్తి వెంకన్న, శీరం సంతోష్ తదితరులు మండలంలోని పలు ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. కంకటావ గ్రామంలోని వెంకటాచల వేణుగోపాల స్వామి ఆలయ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిగితే, ఈఓ, కేసులు పెడితే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. కేసులు నమోదు చేయడంలో పోలీసుల జాప్యం జరుగుతుందని నిలదీశారు. నారికేడలపాలెంలో రాత్రి పూట మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, ప్రశ్నిస్తే ఎమ్మెల్యే తోలుకోమని చెప్పారని, అధికారులు చెబుతున్నారంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మట్టి తవ్వకాలపై వీఆర్వోను అడిగితే ఎమ్మెల్యే తవ్వకోమని చెప్పారంటున్నారని, తహసీల్దారుని అడిగితే రాత్రి పూట మట్టి తవ్వకాలు జరిపితే మాకు ఎలా తెలుస్తుందని, మేము ఏం చేయగలమని బాధ్యతా రాహిత్యంగా సమాధానాలు చెబుతున్నారన్నారు. ఇప్పటి వరకు దీనిపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని, కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి దందా చేసేవారు టీడీపీ, జనసేన నేతలైనా ఉపేక్షించవద్దని సూచించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఇళ్ల కట్టుకునేవారు సొంత పొలాల్లో మట్టి తోలుకునే వారికి ఇబ్బంది పెట్టవద్దని, అక్రమంగా మట్టి దందా చేసే వారికి తాను ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదని సంజాయిషీ ఇచ్చుకున్నారు. అక్రమంగా మట్టి దందా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గోకులం షెడ్లు కేవలం టీడీపీ వారికే మంజూరు చేశారని, జనసేన పార్టీ వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేడీసీసీ మాజీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ గూడూరులోని ఇళ్ల స్థలాలు గతంలో గ్రామ కంఠంలో ఉండటంతో సబ్ డివిజన్ చేయడంలేదని, రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్తే సబ్ డివిజన్ సర్వే నంబరు నిర్ధారణ సర్టిఫికెట్ అడుగుతున్నారని, ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సర్టిఫికెట్ ఇచ్చేలా చూడాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం కరెంటు నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ జి.వెంకటరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పెదపాలెం, ఏటిమొగ, దిననమ్మవారిపాలెం, గుల్లలమోద, ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ దీవుల్లోని గ్రామాల్లో లైన్లపై విద్యుత్ తీగలకు అడ్డంకు కలిగిస్తున్న చెట్ల కొమ్మలు నరకడం, పోల్స్ లీనింగ్స్, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

- **కోడూరు:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ కోత విధించనున్నట్టు ఆ శాఖ ఏఈ గోపీచంద్ శుక్రవారం తెలిపారు. కోడూరు విద్యుత్‌లైన్స్‌పై వాలిన చెట్లను ట్రిమ్ చేయడంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, గృహాలతో పాటు ఆక్వా చెరువులకు కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.
- **అవనిగడ్డ:** పాత విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డులో పూర్తిగా, 2,3 వార్డుల్లో కొంతమేర, పులిగడ్డ, మోదుమూడి, అశ్వారావుపాలెం, రామచంద్రపురం, వలందపాలెం, సర్ధాకోడు, మేడిలంక, అయ్యావారిపాలెం, ఒడుగువారిపాలెం, కోడూరు మండలం మాచవరంలో విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

చల్లపల్లి: మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చల్లపల్లి, ఘంటసాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సూపర్‌వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి తెలిపారు. చల్లపల్లిలోని 12 నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఒకటి, ఘంటసాల మండలం గోగినేనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పదవ తరగతి పాసై 21 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల లోపు ఉన్న వివాహితులైన స్థానిక మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి చేసిన దరఖాస్తులను స్వయంగా మొవ్వ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు.

- **అవనిగడ్డ:** మండల పరిధిలోని తుంగలవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు సీడీపీవో వి. శేషుకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ జనరల్ మహిళలకు కేటాయించిన ఈ పోస్టుకు అర్హులైన వారు ఈనెల 17వ తేదీలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

వాసవీ అమ్మవారికి మామిడి పండ్ల ఉత్సవం



పెడన: స్థానిక శ్రీ వాసవీ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వాసవిమాతకు పట్టణ పరిధిలోని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ మల్లెల పుష్పార్చన భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యసాయిరాం ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య అమ్మవారిని లక్ష మల్లెపూలతో అర్చించారు. వెయ్యి మామిడి పండ్లతోపాటు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ పాల్గొని శ్రీరాములు స్వర్ణంతో సంపత్ల పర్యవేక్షణలో పూజలు జరిగాయి. అనంతరం శ్రీ వాసవీ అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి మేళతాళాల మధ్య ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్న, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.